# నీటి ఉంగరం

సాయంత్రం ఆరున్నరకు మొదలయిన కార్యక్రమం చివరిదశకు చేరుకునేసరికి రాత్రి తొమ్మిది దాటింది. సుబ్బరాజు మాకు ఇచ్చిన సమయం తొమ్మిదిన్నర వరకే. తొమ్మిదిన్నరకు అతను సైదాబాద్ కాలనీకి వెళ్ళి, ఏదో ఫంక్షన్‌కు వెళ్ళిన భార్యా పిల్లలను తీసుకురావాలి. అతను భార్యావిధేయుడు. నాకింకా కష్టాలు మొదలు కాలేదు. బ్రహ్మచారిని. నాది హైదరాబాద్ కాదు. గుంటూరు. అయిదారు నెలలకు ఒకసారి మా సంస్థ బకాయిలు వసూలు చేయడానికి వస్తుంటాను.

వచ్చినప్పుడల్లా రెండు మూడు రోజులు

సుబ్బరాజుతో కులాసాగా గడుపుతుంటాను. అతనూ నేను కలిసి చదువుకున్నాం. అతనికి పెళ్ళి అయ్యాక అదృష్టం కలిసివచ్చి పట్టిందంతా బంగారమయింది. హైదరాబాద్‌లో ఇల్లు కట్టుకుని, మంచి ఉద్యోగంలో చేరి అంచెలంచెలుగా పైకి వస్తున్నాడు.

గుంటూరులో ఇటువంటి కార్యక్రమాలు జరుపుకోడానికి వీలు చిక్కదు. ఎంత చిన్న తప్పు చేసినా మా ఇంటికి వార్త చేరిపోతుంది. మా కార్యక్రమంలోని మూడో వ్యక్తి పేరు లక్ష్మి. ఆమెకు ఇరవై రెండు సమంత్సరాలుండొచ్చు. అంత లావు కాదు. సన్నమూ కాదు. అందమైన మనిషేం కాదు కాని ఆకర్షణీయంగా ఉంది. బూడిదరంగు నేతచీరలో సింపుల్‌గా ఉంది. మెడ బోసిగా ఉంది. చెవులకు తెల్లటి దుద్దులున్నాయి. చేతులకు మట్టి గాజులు ఉన్నాయి.

ఆమె పేరు తప్ప, మరే వివరాలు సుబ్బరాజు నాకు చెప్పలేదు. రెండు పెగ్గులు తనంతట తనే ఆమె గురించి చెబుతాడని ఎదురుచూశాను. చెప్పడం ఇష్టం లేదో, ఏమో చెప్పలేదు. నేను మూడు పెగ్గులకు మించి తీసుకోను. లక్ష్మికి మొహమాటమో, తాగటం ఇష్టం లేదో మాతో కూర్చుంది కాని సోడా తప్ప మరేమీ తాగలేదు. కాని మంచింగ్ పదార్థాలు తీసుకుంది. ఆకలిమీద ఉన్నట్టనిపించింది. తిండిపదార్థాలు ఉన్న ట్రే ఆమెకు అందేలా జరిపినప్పుడు నవ్వింది. కవ్వింపుగా లేదు. కొత్తేమో తెలియదు.

సుబ్బరాజు సంగతి సరేసరి. అతనో చిన్న పీపా. విచిత్రం ఏమిటంటే అతను అరోకారో ఎక్కువ తీసుకున్నా తొణకడు. అతని భార్యను చూడగానే నిషా ఇంకిపోతుంది. భార్య ముందు ఎంతో అమాయకంగా ఉంటాడు. అతని చిరుతిళ్ళ విషయం ఆమెకు తెలియదనుకుంటాను. గుట్టు మనిషి.

తొమ్మిది కాక మునపే సరంజామా సర్ది సెంట్రల్ టేబిల్ శుభ్రం చేసి, గ్లాసులు శుభ్రంగా కడిగి గుడ్డతో తుడిచి కప్‌బోర్డులో పెట్టేసి, "మై జాబ్ ఈజ్ ఓవర్. ఇహ నీ సంగతి, నువ్వు లక్ష్మిని తీసుకువెళ్ళగలవా?" అడిగాడు.

నేను జవాబు చెప్పేలోపల ఆమె వయిపు తిరిగి, "మా వాడితో వెళ్ళడానికి నీకేం అభ్యంతరం లేదు కదా?" అడిగాడు.

ఆమె నావంక చూసి, "మీరే హొటల్‌లో దిగారు?" అడిగింది.

"హొటల్‌లో దిగలేదు. మా స్నేహితుని ఇంట్లో దిగాను."

"ఎక్కడ?"

చెప్పాను.

ఆమె నుదుటికి మడతలు పడ్డాయి.

"ప్రస్తుతం మా స్నేహితుడు ఊళ్ళో లేడు. ఈ ఉదయాన్నే బెంగుళూరు వెళ్తూ ఇంటి తాళం నాకిచ్చి వెళ్ళాడు. ఆ ఇంట్లో ఉండేది నేనొక్కడినే. నీకు రావడం ఇష్టమయితే నువ్వు ప్లస్‌వి."

లక్ష్మి సుబ్బరాజు వంక చూసింది.

సుబ్బరాజు తలూపాడు.

లక్ష్మి "సరే" అంది నాతో.

అతను లేచి "ఆలస్యం అయితే మా ఆవిడ కోపానికి గురయిపోతాను. మీ ఇద్దరినీ నా కారులో సెంటర్లో డ్రాప్ చేస్తాను. మీకా సెంటర్‌లో ఆటోరిక్షా దొరుకుతుంది. దగ్గర్లో టాక్సీస్టాండ్ లేదు" అన్నాడు.

సుబ్బరాజు మమ్మల్ని ఆబిడ్స్ సెంటర్‌లో డ్రాప్‌చేసి వెళ్ళిపోయాడు. ఎదురుగా వస్తున్న ఆటోరిక్షాను ఆపి ఎక్కి కూర్చున్నాను. లక్ష్మి ఆటోలో ఎక్కడానికి తటపటాయిస్తోంది. మనసు మార్చుకుని రాదా?

"రా, కూర్చో" అన్నాను.

అరనిమిషం పాటు తటపటాయించి, కాలు రిక్షాలో పెడుతోంటే పక్కకు జరిగి ఆమె ఎక్కి కూర్చోగానే దగ్గరకు జరిగి నడుంచుట్టూ చేయివేసి, "మారేడ్‌పల్లి, ఈస్ట్" అన్నాను.

ఆటో కదిలింది.

నడుం నొక్కుతూ, "ఆటో ఎక్కడానికి ఎందుకు తటపటాయించావు?" అడిగాను.

"చెప్పు తెగిపోయింది" చిన్నగా అంది.

"కొత్తవి కొనుక్కుంటావా?"

"ఇప్పుడు కాదు. రేపు కొనుక్కుంటాను."

రిక్షా వేగం పుంజుకుంది. ఎటువైపు తీసుకువెళ్తున్నాడో నాకు తెలియడం లేదు. ఇన్నిసార్లు హైదరాబాద్ వచ్చినా ఎప్పటికప్పుడు కొత్తగా ఉంటుంది. లక్డీకాపూల్ దాటిన తర్వాత ఆటో ఎడమవైపుకు తిప్పి ఇరవై నిమిషాలపాటు వేగంగా నడిపి ఒక సెంటర్‌లో ఆపాడు. అది సరయిన దారి కాదని అనిపిస్తోంది.

"నీకు మారేడ్‌పల్లి దారి తెలియదా?" అడిగాను.

అతను వెనక్కి తిరిగి చూడకుండా, "నాకు కొత్త సార్" అన్నాడు.

"ఈ మాట ముందే చెప్పి ఉంటే ఇంకో ఆటో మాట్లాడుకునే వాళ్ళం కదా?"

అతను జవాబు చెప్పలేదు. అతను ఆటో నెమ్మదిచేసి అటుపక్కగా వచ్చిన ఇద్దరు కుర్రాళ్ళను ఆపి మారేడ్‌పల్లికి దారి అడిగాడు.

"నువ్వు ఎక్కడినుండి వీళ్ళను తీసుకువస్తున్నావు?" అడిగాడు ఒక కుర్రాడు.

చెప్పాడు.

"ఇది ఆసిఫ్‌నగర్. మెహిదీపట్నం దాటి వచ్చారు..."

ఆటో దిగి "సికింద్రాబాద్‌కు దారిచెప్పండి" అన్నాను.

ఒకతను చెప్పాక ఆటో ఎక్కి కూర్చున్నాను. అక్కడక్కడా దారి అడుగుతూ ఎలా అయితేనేం మారేడ్‌పల్లి చేరుకున్నాం. రిక్షా దిగాం.

"ఎంతివ్వమంటావు?" అడిగాను.

"మీ ఇష్టం సార్"

"మామూలుగా అయితే ఎంతవుతుంది?"

"నాకూ తెలియదు" అన్నాడు అమాయకంగా.

అతని మాటలకు జాలిపడాలో, అరవాలో అర్థం కాలేదు. పర్సులోంచి డబ్బులు తీసి ఎక్కువే ఇచ్చాను. అందుకుంటుంటే వీధిదీపపు వెలుతురులో అతని కళ్ళల్లో నీరు కదలడం చూశాను.

"చాలా థేంక్సండీ" చేతులు జోడించాడు.

లక్ష్మి దిగి నా వెనక నుంచుంది. అతను రిక్షా స్టార్ట్ చేయడానికి ప్రయత్నించాను. కదలలేదు. వీధి నిర్మానుష్యంగా ఉంది. లక్ష్మీ చేయి అందుకుని

వీధి తలుపు తాళం తీసి తలుపు తెరిచాను. లోపలకు నడిచాం. తలపు పక్కనే ఉన్న స్విచ్ నొక్కాను. గది ప్రకాశవంతమయింది. పడకగది మేడమీద ఉంది.

తలుపు మూయబోతూ బయటకు చూశాను. ఆటోరిక్షా అతను తంటాలుపడినా కదిలినట్టు లేదు. అతని దగ్గరకు వచ్చి, "ఏమయింది?" అడిగాను.

"పెట్రోలు అయిపోయినట్టుంది. బండి ఇక్కడే పెట్టి తెచ్చుకుంటాను" అన్నాడు.

"సరే"

అతను ప్లాస్టిక్ సీసా తీసుకుని వెళ్ళిపోబోతుంటే పెట్రోలు బంకు దగ్గర్లో ఎక్కడుందో చెప్పాను.

అతను వీధి దాటేవరకు ఉండి, చొక్కా గుండీలు ఒక్కొక్కటిగా తప్పిస్తూ ఇంట్లోకి వచ్చాను. లక్ష్మి కిటికీ చువ్వలు పట్టుకుని బయటకు చూస్తోంది. ఆమె నడుం చుట్టూ చేయివేసి మెడమీద ముద్దు పెట్టుకుని, "ఆటో అతన్ని చూస్తుంటే జాలేసింది" అన్నాను.

ఆమె నా వయిపు తిరగలేదు. బయటకు చూస్తూనే తలాడించింది.

"మనల్ని అంత వేగంగా ఆటోలో తీసుకొస్తున్నప్పుడు దేనికయినా గుద్దేస్తాడని భయపడ్డాను" అని ఆమెను నా వయిపు తిప్పుకున్నాను. ఆమె కళ్ళల్లోంచి నీరు జారుతోంది. ఆమె నడుం మీంచి నా చేయి తీసేశాను.

"తిరిగి వెళ్ళేప్పుడు ఆటోను దేనికయినా గుద్దించేస్తాడని భయంగా ఉంది."

"నీకు... అతను తెలుసా?"

"అతని పేరు రామకృష్ణ. నా తమ్ముడు..." అని రుమాలుతో కన్నీళ్ళు తుడుచుకుని, "మాది పేదకుటుంబం. మా చిన్నప్పుడే నాన్న చనిపోయాడు. అయిదు సంవత్సరాల కిందట అమ్మ చనిపోయింది. అమ్మ వాళ్ళింట్లో, వీళ్ళింట్లో పనిచేస్తూ ఎంతోకొంత సంపాయిస్తున్నప్పుడు ఆకలిబాధ ఏమిటో తెలియలేదు. రామకృష్ణ కాకుండా నాకు మరో తమ్ముడు, చెల్లెలు ఉన్నారు. నా సంపాదనతో మేం నలుగురం బతకాలి. ఇది తప్ప వేరే మార్గం లేదు. ఇలా ఇల్లు గడుపుతున్న విషయం ఒక్క రామకృష్ణకే తెలుసు. అంతే, నన్ను ఎవరి చేతుల్లో చూడలేదు.

"వద్దు. ఆపేయమన్నాడు. ఆపేస్తే నాకు దొరికేది పనిమనిషి ఉద్యోగం. నా చదువు పదివరకు రాలేదు. ఏ షాపులో, ఏ ఇంట్లో పనిచేసినా అత్యాచారాలు జరుగుతుండేవి. ఎవరికి చెప్పుకునేది? వారం కిందట నాకూ రామకృష్ణకు ఒక ఒప్పందం కుదిరింది. అదేమిటంటే ఇహనుండి నేనిలా తిరగకూడదు. వాడు ఆటో నడిపి వచ్చే డబ్బులతో ఇల్లు నడిపిస్తాడు.

"అయితే వాడికి ఇక్కడి రోడ్లు, దారులు, వీధులు సరిగ్గా తెలియవు. డ్రైవింగ్ లైసెన్స్ లేదు. ఆటో దొరకడమే కష్టమవుతోంది. ఇల్లు గడవడం కష్టమవుతోంటే వేరే దారిలేక సుబ్బరాజు గారికి ఫోన్ చేసి నా బాధ చెప్పాను. ఆయన నన్ను ఇవేళ రమ్మన్నారు. మీరాయన ఇంటికి వచ్చేముందే నేనాయన ఇంటికి వచ్చాను. మా అమ్మ వాళ్లింట్లో పనిచేసినా ఆయన నన్నెప్పుడూ ముట్టుకోలేదు. మీరు నాకో సహాయం చేసిపెట్టండి. మీరు నన్ను త్వరగా పంపించేస్తే ఇంటికి వెళ్ళే దారిలో తమ్ముడికీ, చెల్లికీ తినడానికి ఏదయినా కొనుక్కుని వెళ్తాను. మేం భోజనం చేసి రెండు రోజులయింది. నీళ్ళు తాగుతూ కడుపులు నింపుకుంటున్నాం..." దుఃఖంతో ఆమె గొంతు బిగుసుకుపోయింది.

ఆకలి ఎటువంటిదో నాకు బాగా తెలుసు.

*'విజయ' మాసపత్రిక, ఆగస్టు* – ***1982***